

బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

గరిడేపల్లి, జూన్ 18 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం ఎర్రబల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులను, పార్టీకి సంబంధించిన వివరాలను మాజీ సీఎం కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, నాయకులు మాశెట్టి శ్రీహరి, కుక్కడపు గుర్వయ్య, బి.సుధీర్ ఉన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 18 : నీట్ యూజీ ఎంట్రెన్స్‌లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా, ప్రధాని మోదీ స్పందించకపోవడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ మాట్లాడుతూ బీహార్‌లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారనే విషయంలో అరెస్టులు జరుగుతున్నా ప్రధాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. నీట్ పరీక్ష ఫలితాల్లో 67 మందికి మొదటి ర్యాంకులు రావడం అనేక అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. నీట్ నిర్వహణలో నిత్యం వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే పరీక్ష నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని, కోచింగ్ సెంటర్లు, కన్సల్టెన్సీల పేరుతో పేపర్ లీకేజీకి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సురం విజయ్‌రెడ్డి, బయ్య గణేశ్, నిఖిల్, సిద్ధార్థ, వంశీ, కృష్ణసాయి, కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

షాక్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.4 లక్షల నగదు, బంగారు ఆభరణాలు అగ్నికి ఆహుతి

పూర్తిగా కాలిపోయిన ఇల్లు

కోదాడ రూరల్, జూన్ 18: పట్టణంలోని తమ్మర పరిధిలోని సుందరయ్యకాలనీకి చెందిన మెగిలి వెంకన్నకు చెందిన పూరిల్లు మంగళవారం ఉదయం విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో కాలిపోయింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన మెగిలి వెంకన్న కుటుంబ సభ్యులతో కలిసి ఆరుబట కూర్చొని టీ తాగుతున్నాడు. అదే సమయంలో ఇంట్లోంచి ఒక్కసారిగా భారీ శబ్దంతో మంటలు చెలరేగాయి. భయభ్రాంతులకు గురైన కుటుంబ సభ్యులు బయటికి పరుగులు తీశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. అప్పటికే ఇల్లుతో పాటు ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో వెంకన్న తన కూతురు పెండ్లి కోసం తీసుకొచ్చి ఇంట్లో ఉంచిన రూ.4 లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు కూడా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. తాము కేవలం కట్టు బట్టలతో బయట పడ్డామని, ప్రభుత్వం, దాతలు తమకు సాయం అందించాలని కోరారు.

వేడికి కరిగిన బంగారు, వెండి నగలు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్రయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగొట్టు ప్రకారం యావన్మందికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తి రిజిస్టార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి నలుకపల్లి సుధాకర్, తండ్రి: అంజయ్య గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకోన్నాము. కావున సదరు వ్యవహారముకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్రయింటు బాధ్యులు కాదు.

SCHEDULE OF THE PROPERTY

జిల్లా రిజిస్ట్రార్ నల్లగొండ, సబ్-రిజిస్ట్రార్ సూర్యాపేట వారి జ్యూరిస్ డిక్షన్‌లోనూ, జిల్లా పరిషత్ సూర్యాపేట, మండలపరిషత్ తిరుమలగిరి, తిరుమలగిరి మండల పరిధిలోగల తొండ రెవిన్యూ గ్రామ శివారులో సర్వే నెం. 454/ఇ మరియు 454/ఉ మింజంలేలో పార్ట్ నెంబరు 28 గల దాని విస్తీర్ణం 200.00 చ.గ.లు సరియగు 67.22 చ.మీ.లు గల ఖాళీస్థలము ఇంటీరియల్ రెసిడెన్షియల్ ఏరియాలో యుండి ఈ దిగువ హద్దులు కలిగియున్నది. హద్దులు: ఉత్తరం: పార్ట్ నెం. 27, దక్షిణం: పార్ట్ నెం. 29, తూర్పు: పార్ట్ నెం. 13, పడమర: 25 అడుగుల రోడ్డు.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117

బాధ్యతలు చేపట్టిన నాయబ్ తాసీల్దార్ హరిచంద్రప్రసాద్

ఆత్మకూర్.ఎస్ డీటీగా హరిచంద్రప్రసాద్

ఆత్మకూర్.ఎస్, జూన్ 18 : మండలం నాయబ్ తాసీల్దార్‌గా జి.హరిచంద్రప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పని చేసి ఆయన బదిలీపై మండలానికి వచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

I Tasleem Kauser, D/o.MA.Mohiuddin, R/o.H.No.5-6-75, Bottuguda Street, Nalgonda Town, Nalgonda District, T.S. have changed my name as TASLEEM KOUSER (New Name).

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | తొలుపునూరు: 9182777638

గాలివాన బీభత్సం

- ఎర్రవరంలో ఇండ్ల పైకప్పులు ధ్వంసం
- చింతలపాలెంలో కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

కోదాడ రూరల్ : ఈదురుగాలికి ఎగిరిపోయిన దుకాణం పైకప్పు

చింతలపాలెంలో ఇంటిపై పడిన రావిచెట్టు

కోదాడ రూరల్, జూన్18: మండలంలోని ఎర్రవరంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు దూళ్లగుట్ట బాల ఉగ్రనరసింహాస్వామి దేవాయల సమీపంలోని దుకాణాల పైకప్పులు, షేడ్ నెట్‌లు ఎగిరిపోయాయి. గ్రామ శివారులోని స్టేజీ వద్ద ఆకుల లచ్చయ్య దుకాణం పైకప్పు పూర్తిగా దెబ్బతిన్నది. దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులు వర్షానికి ఇబ్బందులు పడ్డారు.

చింతలపాలెంలో ..

చింతలపాలెం : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి గ్రామంలోని పలు చెట్లు నేలవాలాయి. చెట్లు కూలి ఇండ్లమీద పడడంతో గ్రామానికి చెందిన గంధం అరుణమ్మ, తునికి పాటి రవి ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. గాలి వానకు పలు చోట్ల రేకుల ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దాంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కోదండరామాలయ భూముల కౌలు వేలం

చిలుకూరు, జూన్ 18 : పాత చిలుకూరులోని కోదండ రామస్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని మంగళవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయానికి చెందిన 30 ఎకరాల భూమిని రెండు సంవత్సరాలు కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలంలో 20 మంది రైతులు పాల్గొన్నారు. కాసాని రామస్వామి, బొంత శివాజీ, మండవ వెంకటేశ్వర్లు, ఆరె రామారావు కలిసి సంవత్సరానికి రూ.7.15 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి కొండారెడ్డి, ఈఓ మృత్యుంజశాస్త్రి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేక లోక్ అదాలత్

హుజూర్‌నగర్/చిలుకూరు, జూన్ 18: జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం కోదాడ సబ్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో హైదరబాద్ కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ వెంకట కృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నీట్‌లో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలి

మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

- సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, జూన్ 18 : నీట్ ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్‌లో జరిగిన అక్రమాలపై ప్రధాని మోదీ మౌనం వీడాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేందుకు తిరిగి పరీక్ష నిర్వహించాలన్నారు. ప్రశ్నపత్రం లీకేజీలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, నాయకులు కొమర్రాజు వెంకట్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కోదాడ రూరల్, జూన్18 : మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన దాచేపల్లి శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్దే చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దొంతగాని అప్పారావుగౌడ్ మంగళవారం బాధితుడిని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

ఆంజనేయుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 18 : మండలంలోని బూరుగడ్డలో గల ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామికి 108 తమలపాకులతో పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ వెంకట చలపతిరావు, అలయ అర్చకులు ముడుంబై హరిశాచార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

కోదాడటౌన్ : పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, కార్యదర్శి కోట తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

అర్వపల్లి, జూన్ 18 : అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం మంగలవారం తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఈ నెల 20న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సీహెచ్ఓ చరణ్, స్టాఫ్ నర్స్ రమాదేవి, ఫార్మసిస్టు మాధవి ఉన్నారు.

నేడు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ పర్యటన

రూ. 126 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నేరేడుచర్ల, జూన్ 18 : భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద రూ. 40 కోట్లతో ఐటీఐ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, 1.15 గంటలకు చింతలపాలెం మండలం దొండపాడులో రూ.20కోట్లతో ఎన్‌హెచ్-9 కొత్త డబుల్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, దొండపాడులో కొత్తగా ప్రతిపాదన చేసిన రెండో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రైతులతో చర్చా కార్యక్రమం, 2.30 గంటలకు హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరిలో రూ. 20 కోట్లతో హుజూర్‌నగర్- యాతవాకిళ్ల డబుల్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4 గంటలకు నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద రూ.20 కోట్లతో చిల్లేపల్లి- సోమారం కొత్త డబుల్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, 5 గంటలకు కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరులో రూ.16 కోట్లతో చిలుకూరు- జెర్రిపోతులగూడెం డబుల్ రోడ్డు నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం 6 గంటలకు గణపవరంలో రూ.10 కోట్లతో కీతవారిగూడెం- మునగాల డబుల్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

పీఏసీఎస్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : చైర్మన్

సభ్యులకు రుణాలను అందిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

కోదాడ రూరల్, జూన్18: సంఘం సభ్యుల ఆర్థికాభివృద్ధికి పీఏసీఎస్ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సభ్యులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను అందించి మాట్లాడారు. రుణాలు పొందిన వారు తిరిగి సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ హుస్సేన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- సీపీఎం జిల్లా నాయకుడు యాదగిరిరావు

మోతె, జూన్ 18 : పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని బుర్కచర్ల గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండలస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక వాగ్దానాలు చేసిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ, కేంద్రంలోని బీజేపీ ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సీపీఎం సీనియర్ నాయకుడు పేరెల్లి ఈదయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి మలుకూరి గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, మండల కమిటీ సభ్యుడు కాంపాటి శ్రీను, నాయకులు కక్కిరేణి సత్యనారాయణ, కిన్నెర పోతయ్య, కొండా రాములు, నాగం మల్లయ్య, బూడిద లింగయ్య, జంపాల స్వరాజ్యం, ఎర్రబోయిన మల్సూర్, వెలుగు మధు, చెగువేరా, కొండ భాస్కర్, దోసపాటి శ్రీను, పళ్ల మరియమ్మ, వాడగల సామ్రాజ్యం, జెర్రిపోతుల లక్ష్మమ్మ, రామచంద్రు, జాన్‌వెస్లీ, బోడపట్ల హుస్సేన్ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో పారిశుధ్య లోపం

నూతనకల్, జూన్ 18 : మండలంలోని బిక్కుమళ్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో పారిశుధ్యం లోపించింది. పాఠశాల తరగతి గదుల ఎదుట, వెనుక భాగంలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. వీటిని తొలగించక పోవడంతో విష పురుగులు చేరే ప్రమాదం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. దాంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులు అసంపూర్తిగానే ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో నిండిపోయిన బిక్కుమళ్ల ప్రభుత్వ పాఠశాల ఆవరణ

మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఆశ్రితారెడ్డి

'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన

నూతనకల్; జూన్ 18 : ప్రతి మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మంగళవారం 24 మంది మహిళల నుంచి రక్త నమూనాలు సేకరించిన సిబ్బంది 12 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకటరెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త విధానం

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జర్నలిస్టులు

సూర్యాపేట రూరల్, జూన్ 18 : జర్నలిస్టుల సంక్షేమం కోసం త్వరలో కొత్త విధానం రూపొందిస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మంలో జరుగుతున్న టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర మహాసభలకు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు కొణిజేటి సత్యనారాయణతో కలిసి వెళ్తూ సూర్యాపేటలో కొద్దిసేపు ఆగారు. స్థానిక జర్నలిస్టులు వారికి స్వాగతం పలికి పూల బొకేలు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ల విషయంలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. హెల్త్‌కార్డుల విషయంలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలతో ముగుస్తున్న అక్రిడిటేషన్ల గడువును మరో మూడు నెలలు పెంచి ఈలోపు కొత్త కార్డుల జారీకి కసరత్తు ప్రారంభిస్తామని చెప్పారు. ఆయన వెంట హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేశ్, యూనియన్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ, జర్నలిస్టులు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న చైతన్య

లైంగిక వేధింపుల నిరోధకచట్టంపై అవగాహన

బొడ్రాయిబజార్, జూన్ 18 : పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై మంగళవారం జిల్లా కేంద్రంలోని మాంగళ్య షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్న సిబ్బందికి మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మీషన్ కో-ఆర్డినేటర్ చైతన్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాల్‌లో 10 మందికి మించి పని చేస్తున్న మహిళలకు ఏర్పాటు చేయాల్సిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ, దాని ఆవశ్యకత, కమిటీ పనితీరును వివరించారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ మేనేజర్ రవి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, ఫైనాన్సియల్ లిటరసీ తేజస్వీని, సౌరబ్, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి

ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజన్న, వినయ్‌బాబు

ముల్కలపల్లి రవిని సన్మానిస్తున్న ఎంఎస్పీ నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 18 : జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహించిన ఆయా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించి జూలై 7కు 30 ఏండ్లు పూర్తవుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో ఎస్సీ వర్గీకరణను త్వరలోనే సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు లక్షలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముల్కలపల్లి రవిని నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కనుకుట్ల వెంకన్న, మొలుగూరి రాజు, బొజ్జ వెంకన్న, తాటిపాముల నవీన్, మేడి కృష్ణ, సిరపంగి నవీన్, కొండేటి గోపి పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హతం

కుటుంబ కలహాలే కారణం

పాలకవీడు, జూన్ 18 : తాగిన మైకంలో భార్యపై కత్తితో దాడి చేసేందుకు యత్నించిన భర్త అదే భార్య చేతిలో హత్యకు గురైన ఘటన మండలంలోని గుడుగుంట్ల పాలెం గ్రామంలో మంగళరం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని మూసీ ఒడ్డు సింగారం గ్రామానికి చెందిన ఆరుట్ల చిరంజీవి వివాహం గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన అరుణతో 15 సంవత్సరాల క్రితం జరిగింది. ఐదేండ్లుగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో పలు మార్లు పెద్ద మనుషులు కలుగజేసుకొని సర్ది చెప్పారు. అయినప్పటికీ వారి మధ్య గొడవలు జరుగుతుండడంతో ఈ నెల 17న అరుణ స్థానిక పోలీసులకు భర్తపై ఫిర్యాదు చేసి, పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. సోమవారం రాత్రి గుడుగుంట్లపాలెంలోని తల్లిగారింట్లో పిల్లలతో కలిసి నిద్రపోతుండగా చిరంజీవి అక్కడికి వచ్చి మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసేందుకు యత్నించాడు. అతడిని ప్రతిఘటించిన అరుణ కర్రతో ఎదురు దాడి చేసింది. కర్ర సున్నితమైన అవయవాలకు తగలడంతో చిరంజీవి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వాహనం అక్కడికి చేరుకొని పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. అరుణ స్థానిక పోలీసులకు సమాచారం అందించగా హుజూర్‌నగర్ సీఐ చల మందరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరంజీవిపై భార్యతో పాటు బంధువులు దాడి చేసి హత్య చేసినట్లు మృతుడి అన్న నరేందర్ ఫిర్యాదు మేరకు మృతుడి భార్య అరుణతో పాటు 10 మంది బంధువులు, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల, జూన్ 18: మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గ